"చెప్తా వినండి - అయినా నటన తెలుసుకుంటే వచ్చేది కాదు. అది పుట్టుకతో రావాలి. అదో కళ. అలా అని సాధన చేస్తే రాదని నేననడం లేదు. తప్పకుండా వస్తుంది. అందుకే చెప్తున్నా వినండి. నటించేటప్పుడు మీరు నటిస్తున్నామనుకోకూడదు. ఆ పాత్రలో మీరూ లీనమైపోవాలి"

సుందరానికహల్య గుర్తుకొచ్చింది.

"తరువాత మీరు చుట్టుపక్కల దృష్టి ఉంచకూడదు - ఎదురుగా ప్రేక్షకులు చూస్తున్నారనీ..."

"వాళ్ళలో అహల్యలాంటి ఎక్స్ట్రాలుంటారనీ" అనుకున్నాడు గోపాలం.

"మనమిప్పుడు ఇరవయ్యో శతాబ్దంలో ఉన్నామని మర్చిపోవాలి. పాత్రతోపాటు ఆ కాలానికి వెళ్ళిపోవాలి. ఇవన్నీ అలవర్చుకొనిననాడే వాడు నటుడౌతాడు"

ప్రకాశం చప్పట్లు కొట్టాడు. "చాలా బాగా చెప్పారండీ... మీరు చెప్పిన లక్షణాలన్నీ అలవర్చుకుంటేనే మేమూ మీలా గొప్ప నటులం కావచ్చు"

"చెప్పడానికేముంది. కానీ ఇది ఆచరణలో పెట్టడం కష్టం. అలా పెట్టిన నాడు నాకే మీరు పాఠాలు చెప్తారు" అన్నాడాయన.

"బాగుందండీ - రావణాసురుడిగా మీ అనుభవాలు చెప్తారా?"

"అనుభవాలకేముంది - ఇందాకా చెప్పినట్లు అప్పుడు నేను మామూలు నాటకాలరావును కాదు. లంకాధీశ్వరుడు రావణాసురుణ్ణి. నా చుట్టూ ఏముందో నాకు తెలీదు. సీతా వ్యామోహం - శివభక్తి ఇవే నాకు తెలిసినవి. ఆ నాలుగ్గంటలూ నాకొళ్ళు తెలీదు"

"చాలా సంతోషమండి.... ఇంతకీ మీరు ఇతర వేషాలేవయినా వేశారా? లేక....." అఁయ్ అన్నాడాయన ఇంకా మాట పూర్తికాకుండానే. "ఒకటేం ఖర్మ లక్ష వేషాలు వేశాను. రావణాసురుడంటే నాకు నచ్చిన పాత్ర అంతే తెలిసిందా!"

"అవునండి - నచ్చిన పాత్రంటూ ఉండడమే ఉత్తమ నటుల లక్షణం" అన్నాడు ప్రకాశం.

నాటకాలరావు నవ్వి - "ఇంతకీ మీరేదైనా నాటకం వేస్తున్నారా" అన్నాడు. "అబ్బేలేదండీ - మా ఫ్రెండు ఒకడు పిక్చర్ తీస్తున్నాడు. అందులో మమ్మల్నందర్నీ నటించమనీ పిక్చర్ ఫెయిలయినా ఫరవాలేదనీ బతిమాల్తున్నాడు. మేము నటించగలం గానీ అనుభవం లేదు. మీలాంటి అనుభవశాలుర దగ్గర నటనంటే యేమిటో తెలుసుకోవాలని వచ్చాం" అన్నాడు ప్రకాశం.

"ఇంతకీ మీరు సినిమా నటులు కాబోతున్నారా? అయితే నా దగ్గరకెందుకొచ్చారు? సినిమా నటులకి నటన అక్కర్లేదు. మొహం బాగుంటే చాలు. తెలిసిందా - వెళ్ళండి!" అన్నాడాయన కోపంగా.

"అది కాదండీ-" ప్రకాశంఏదో చెప్పబోయాడు. నాటకాలరావు రావణాసురుడిలా గర్జించాడు. "దయుంచి వెళ్ళండి ఇంక నేను మీకేమి చెప్పను."

అంతా లేచి బైటకొచ్చేశారు. తలుపు వేసిన చప్పుడు చాలాదూరం వినిపించింది. "గురూ! ఇంతకీ మనం ఓ చిన్న రిహార్సల్ వెయ్యాలి" అన్నాడు శంకర్రావు. సరే! అంతా భోజనాలు చేసొద్దాం. ఈలోపుగా ఏదైనా మంచి ఐడియా తట్టుందేమో చూస్తా అప్పుడంతా కాలవగట్టుకిపోదాం" అన్నాడు ప్రకాశం.

"సరే - నాకాకలిగా ఉంది కూడా" అన్నాడు సుందరం - కమేడియన్ తిండి విషయం ఎక్కువగా మాట్లాడాలిట.

మిట్టమధ్యాహ్నం పన్నెండు గంటలకి అంతా కాలవగట్టుమీద సమావేశమయారు. తనకొచ్చిన ఐడియాని ప్రకాశం యిలా చెప్పడం మొదలుపెట్టాడు. "మనం యాక్టు చెయ్యబోయేది స్టంట్ పిక్చర్లో కాబట్టి చెప్తున్నా వినండి. శంకర్రావు దొంగల నాయకుడు. ప్రస్తుతానికి లేకపోయినా కొంతమంది అనుచరులున్నారన్నమాట. హీరోయిన్ ఇక్కడ విహారం చేస్తూంటుంది. ఓ పాట కూడా ఉంది. దూరాన ఉన్న ప్రియుణ్ణి పిలుస్తూ పాటన్నమాట.

"సరే బీస్ సాల్ బాద్‌లోది కాపీ కొడతా" నన్నాడు గోపాలం.

"ఉండు నన్ను పూర్తిగా చెప్పనీ. పాటలో మ్యూజిక్ జరుగుతూంటే దొంగల నాయకుడు అనుచరులతో గుర్రంమీద రావడం చూపించడం సస్పెన్సన్నమాట. ఈ సన్నివేశమంతా ఓ అడవిలో జరుగుతూంటుందన్నమాట."

"ఒక్క సందేహం. ఇంతకీ హీరోయిన్ అడవిలోకి విహారానికెందుకొచ్చింది" అన్నాడు సుందరం.

"స్టంట్ పిక్చర్లో హీరోయిన్సడవిలోకే వెళ్తారు. లేకపోతే కథే లేదు. ఇది చచ్చు ప్రశ్నన్నమాట. అసలు స్టంట్ పిక్చర్లని చూసి ఆనందించాలే గానీ సంభవమా అసంభవమా అని ఆలోచించకూడదు. స్టంట్ పిక్చరంటే ఏమిటో చెప్పి మళ్ళీ మొదలెట్టాడు ప్రకాశం. పాటంతా పూర్తవగానే దొంగల నాయకుడు హీరోయిన్నీ చెలికత్తెలనీ దోచుకుందుకు ప్రయత్నిస్తాడు. దూరాన ఉన్నకమేడియన్ చూసి భయపడిపోయి హీరో దగ్గరకి పరుగెడతాడు. పాట ఎక్కణ్ణించి వస్తోందా అని హీరో వెదుకుతూంటాడు. అతను కమేడియన్ దగ్గర విషయం విని దొంగల నాయకుడు దగ్గరకు పరుగెడ్తాడు. ముందు అనుచరులంతా చస్తారు. కొంతమందిని కమేడియన్ కూడా విట్టీగా చంపుతాడు. ఇది చూసి దొంగల నాయకుడు చెట్టెక్కేస్తాడు. హీరో కూడా చెట్టెక్కుతాడు. ఇద్దరికీ చెట్లమీద స్టంటు. ఫస్టు టైము కదా దొంగల నాయుకడెలాగో తప్పించుకుని పారిపోతాడు. హీరోయిన్ హీరోని ప్రేమిస్తుంది. ఇదీ సన్నివేశం" అన్నాడు ప్రకాశం. "చాలా బాగుందిరా!" అన్నాడు విశ్వనాథం.

"మరి హీరోయిన్!" అన్నాడు శంకర్రావు.

"అందాకా నేను అన్నాడు ప్రకాశం. "నువ్వయితే మాలో భావాలు కలగొద్దూ" అన్నాడు శంకర్రావు. "కలగనప్పుడు నువ్వు నటుడివే కాదు" అన్నాడు ప్రకాశం. "సరే రిహార్సలెక్కడ!" అన్నాడు సుందరం.

మనమంతా చిన్నప్పట్నించీ స్నేహితులం. కళాకారులం. కానీ మనలోని కళ అభివృద్ధి చెందేదెలా? లోకానికి తెలిసేదెలా? అందుకే మన ఊరివాళ్ళతో ఓ సినిమా తీయాలని నిశ్చయించుకున్నాను.

నీకు చిన్నప్పట్నుంచీ పెద్ద పెద్ద ఆదర్శాలున్నాయి. నీలో వృద్ధిలోకి రావలసిన దర్శకుడి లక్షణాలు చాలా ఉన్నాయి. హైస్కూల్లో కూడా నాటకాలను నువ్వే డైరెక్టు చేసేవాడివి. నిన్ను డైరెక్టర్‌గా బుక్ చేస్తున్నాను. కాదనవనే నమ్మకం నాకుంది. సోమవారం 1వ తేదీన నేను మీ ఊరు వస్తాను. ఈ విషయం పెద్దలెవ్వరికీ తెలియనీకు. మన మిత్రుల్లోనే రహస్యంగా ఉంచేయ్.

ఒకటి మాత్రం గుర్తుంచుకో. నేను తీయబోయేది స్టంటు చిత్రం. దానికాట్టే దర్శక ప్రతిభ అవసరం లేదు. ప్రథమంలో నువ్వంతకు మించి డైరెక్టు చేయలేవనవే అనుమానంతో స్టంటు చిత్రం నిర్మాణానికి పూనుకున్నాను. నేవచ్చేలోగా నీ టాలెంట్‌కు మెరుగు పెట్టు.

నీ ప్రియమిత్రుడు

బ్రహ్మం"

ఉత్తరం విని అంతా నవ్వారు. "ఇది ఎలాగో అలా పోస్టులో వచ్చిందని రాజారావు కందజేయాల్రా" అన్నాడు బ్రహ్మం. గోపాలం గట్టిగా "చంద్రయ్యా" అని పిలిచాడు. పాలేరు చంద్రయ్య పరుగెట్టుకుంటూ వచ్చాడు. గోపాలం డ్రాయరు తీశాడు. ఇది వరకు బ్రహ్మం రాసినట్లు తమ్ముడురాసిన ఉత్తరం తాలూకు కవరందులో ఉంది. అది తానిదివరకు జాగ్రత్తగానే చించాడు. అందులో బ్రహ్మం రాసిన ఉత్తరం పెట్టాడు. జిగురుతో అంటించి వెనకాల అడ్రస్ మీద తన పేరు ముందు కేరాఫ్ అని రాసి పైన తమ్ముడి పేరు రాశాడు.

బ్రహ్మం "అద్భుతం రా నీ బుర్ర" అంటూ భుజం తట్టాడు.

"చంద్రయ్యా! తమ్ముడు తోటలో ఉంటాడు బహుశా. నువ్వీ ఉత్తరం పట్టుకెళ్ళి ఈ ఉత్తరం వచ్చి చాలా రోజులయిందనీ అప్పటికింకా తను రాలేదనీ నాన్న గారు పెట్లో పెట్టి దాచారనీ చెప్పి - అయ్యగారికిప్పుడు గుర్తుకొచ్చింది. అర్జంటుత్తరమేమోనని పంపించారని చెప్పు - అర్థమైందా!"

"అర్థమైంది బాబూ!" చంద్రయ్య ఆ లెటర్ తీసుకునివెళ్ళిపోయాడు. "ఒక ముఖ్య విషయం చెప్పకుండా దాచినందుకు నన్ను క్షమించండిరా!" అన్నాడు బ్రహ్మం.

మిత్రులంతా ఆశ్చర్యంగా బ్రహ్మం వంక చూశారు.

"నేను సినిమా తీయదల్చుకున్నమాట నిజమే. అయితే స్టంటు సినిమా తీయాలనే ఉద్దేశం మాత్రం కాదు. ఎవరో ముసిలిది పోయింది. ఆవిడకి నేను తప్ప వారసులెవరూ లేరట. అదృష్టవశాత్తు అనుకోకుండా ఆస్తి కలిసింది. చిన్నప్పుడుఅనేవాణ్ణిగా. నా దగ్గరే గనక డబ్బుంటే మిమ్మల్నందర్నీ పెట్టుకుని సినిమా తీస్తానని. ఆ అయిడియా తట్టే సినిమా తీద్దామనుకున్నాను. ఈ విషయమే మీ అందరికీ చెప్పి మిమ్మల్ని ఆశ్చర్య

